


నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
EVENING EDITION
పేజీలు: 02
PM

# యానిమల్ రివ్యూ

దర్శకుడు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రణబీర్ కపూర్ లాంటి టాలెంటెడ్ హీరో కలయికలో వచ్చిన సినిమా యానిమల్. కాగా ఈ చిత్రం ఈ రోజే విడుదల అయింది. మరి ప్రేక్షకులను ఏ మేరకు మెప్పించిందో సమీక్షలోకి వెళ్లి తెలుసుకుందాం!

**కథ:** రణ్ విజయ్ సింగ్ బల్బీర్ (రణబీర్ కపూర్)కి తన తండ్రి బల్బీర్ సింగ్ (అనిల్ కపూర్) అంటే పిచ్చి ప్రేమ. అయితే, బల్బీర్ సింగ్ బిజీ బిజినెస్ మెన్. భారత దేశంలోనే అతిపెద్ద స్వస్తిక్ స్టీల్ ఫ్యాక్టరీని నిర్వహిస్తుంటాడు. ఆ బిజీ లైఫ్ లో కొడుకుతో ఎక్కువ సమయాన్ని గడపలేకపోతాడు. ఈ క్రమంలో జరిగిన కొన్ని సంఘటనల కారణంగా రణ్ విజయ్ సింగ్ కి – బల్బీర్ సింగ్ కి మధ్య దూరం పెరుగుతుంది. దాంతో, కొడుకుని బోర్డింగ్ స్కూల్‌కు పంపిస్తాడు. ఆ తర్వాత జరిగిన కొన్ని నాటకీయ పరిణామాల మధ్య రణ్ విజయ్ సింగ్, గీతాంజలి (రష్మిక)తో ప్రేమలో పడి ఆమెను పెళ్లి చేసుకుని యూఎస్ వెళ్లిపోతాడు. ఐతే, బల్బీర్ పై జరిగిన హత్యాయత్నం గురించి తెలుసుకుని, తిరిగి ఇండియాకి వస్తాడు. అసలు బల్బీర్ సింగ్ ను చంపాలనుకుంది ఎవరు ?, తన తండ్రి శత్రువులపై విజయ్ ఎలా ప్రతీకారం తీర్చుకుంటాడు ?, అందుకోసం ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నాడు ? చివరికి ఏం జరిగింది? అనేది మిగిలిన కథ.




**ప్లస్ పాయింట్స్:** రణబీర్ కపూర్ తన పాత్ర పరిస్థితులకు తగ్గట్టు డిఫెరెంట్ వేరియేషన్స్ లో నటించి మెప్పించాడు. ముఖ్యంగా తన బాడీ లాంగ్వేజ్ తో అలాగే, కొన్ని యాక్షన్ అండ్ ఫ్లాష్ బ్యాక్ సీక్వెన్స్ స్ లో విజయ్ చాలా బాగా నటించాడు. ముఖ్యంగా రణబీర్ తన నటనతోనే కాకుండా తన లుక్స్ తో కూడా ఈ సినిమాకి హైలైట్ గా నిలిచాడు. మరో కీలక పాత్రలో ఫాదర్ గా నటించిన అనిల్ కపూర్ నటన ఆకట్టుకుంది. తండ్రి, కొడుకుల మధ్య ఎమోషనల్ డ్రామా కూడా బాగుంది. ఇక సెకండ్ హాఫ్ లో మరో కీలకమైన పాత్రలో కనిపించిన బాబీ డియోల్ కూడా చాలా వైల్డ్ గా కనిపించి ఆకట్టుకున్నాడు. యాక్టింగ్ పరంగా బాబీ డియోల్ గత తన చిత్రాల్లో కంటే ఈ చిత్రంలో చాలా బాగా నటించాడు. హీరోయిన్ గా రష్మిక మందన్నా మెప్పించింది. బరువైన భావోద్వేగ సన్నివేశాల్లో కూడా ఆమె సెటిల్డ్ గా నటించే ప్రయత్నం చేసింది. మరో హీరోయిన్ తృప్తి డిమ్రి నటన బాగుంది. కొన్ని బోల్డ్ సీన్స్ లో ఆమె తన గ్లామర్ తో సినిమాకి ప్లస్ అయ్యింది. చారు శంకర్, శక్తి కపూర్ మరియు బబ్లూ పృథ్వీ రాజ్ అలాగే మిగిలిన నటీనటులు కూడా తమ పాత్రల పరిధి మేరకు బాగా నటించారు. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా రాసుకున్న యాక్షన్ ఎపిసోడ్స్ అండ్ ఎమోషనల్ సీన్స్ బాగున్నాయి.

**మైనస్ పాయింట్స్:** తండ్రి పై తనకున్న పిచ్చి ప్రేమతో ఓ కొడుకు, తన తండ్రి కోసం ఏం చేశాడు అనే కోణంలో సాగిన ఈ సినిమాలో బలమైన కథ లేదు. తండ్రిని చంపడానికి చూసిన శత్రువులను ఎలా చంపాడు ? అనేదే ప్రధానమైన కథ అయిపోయింది. దీనికితోడు కథలోని ప్రతి పాత్ర, ఆ పాత్రల తాలూకు ప్రతి ఎమోషన్ ఫోర్స్డ్ గానే ఉంటుంది. కొన్నిచోట్ల ఎమోషన్స్ పీక్ స్టేజ్ లో ఉన్నాయనే ఫిల్ కలిగినా.. దాని కోసం ఈ పాత్ర ఎందుకు ఇలా బిహేవ్ చేస్తోంది ? అనే అనుమానం కూడా వెంటాడుతూ ఉంటుంది. నిజానికి రణబీర్ కపూర్ పాత్ర తాలూకు ఫ్లాష్ బ్యాక్ ను బాగా డిజైన్ చేసుకున్న సందీప్, అంతే స్థాయిలో ఈ యానిమల్ సినిమా ట్రీట్మెంట్ ను మాత్రం రాసుకోలేదు. ముఖ్యంగా ఆసక్తికరంగా కథనాన్ని రాసుకోవడంలో సందీప్ రెడ్డి వంగా కొన్ని చోట్ల విఫలం అయ్యారు. చాలా సన్నివేశాలు బాగా స్లోగా సాగుతున్న ఫీలింగ్ కలుగుతుంది. పైగా గత తన సినిమా శైలిలోనే సందీప్ రెడ్డి, ఈ సినిమాని కూడా రెగ్యులర్ ప్లేతోనే నడిపాడు. ఫస్ట్ హాఫ్ ను వేగంగా నడిపిన ఆయన సెకెండాఫ్ ని మాత్రం మరీ సాగతీశారు. ఒక్క క్లైమాక్స్ లో తప్ప మిగిలిన కథనంలో ఉత్సుకతను పెంచటంలో విఫలమయ్యారు. అసలు కథనాన్ని ఇంకా ఆసక్తికరంగా మలిచే అవకాశం ఉన్నప్పటికీ సందీప్ రెడ్డి మాత్రం తన శైలిలోనే సినిమాని ముగించారు.

**సాంకేతిక విభాగం:** దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కొన్ని సన్నివేశాలను ఎమోషనల్ గా బాగా తెరకెక్కించినప్పటికీ.. తీసుకున్న స్టోరీ లైన్ కి పూర్తి స్థాయిలో ఆకట్టుకునే విధంగా ఆయన యానిమల్ కథాకథనాలను రాసుకోలేకపోయారు. సినిమాలో బ్యాక్ గ్రౌండ్ స్కోర్ బాగుంది. సంగీత దర్శకుడు అందించిన పాటలు పర్వాలేదు. సినిమాటోగ్రఫీ బాగుంది. సినిమాలోని చాలా సన్నివేశాలను చాలా బ్యూటిఫుల్ గా చిత్రీకరించారు. ఇక ఎడిటింగ్ విషయానికి వస్తే.. అక్కడక్కడా ఉన్న కొన్ని సాగతీత సీన్స్ ను తగ్గించాల్సింది. సినిమా నిడివి బాగా ఎక్కువైపోయింది. నిర్మాతలు ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ చిత్రాన్ని నిర్మించారు. నిర్మాణ విలువులు చాలా బాగున్నాయి.

**తీర్పు:** 'యానిమల్' అంటూ హై వోల్టేజ్ ఇంటెన్సివ్ యాక్షన్ డ్రామాగా వచ్చిన ఈ చిత్రంలో రణబీర్ కపూర్ నటన, భారీ వైల్డ్ యాక్షన్ సీన్స్, బోల్డ్ ఎలిమెంట్స్ అండ్ హెవీ ఎమోషన్స్ మరియు క్లైమాక్స్ బాగున్నాయి. ఐతే, సినిమాలో బలమైన ఎమోషన్, కాన్ ఫ్లిక్ట్ ఉన్నప్పటికీ… ఆ ఎమోషన్ లో, ఆ కాన్ ఫ్లిక్ట్ లో ప్రేక్షకుడు ఇన్ వాల్వ్ అయ్యేంతగా.. అవి సరిగ్గా ఎస్టాబ్లిష్మెంట్ కాలేదు.

# టీ20 ప్రపంచకప్ 2024లో పాల్గొనే 20 జట్లు ఇవే..

## జాబితాను ప్రకటించిన ఐసీసీ

వన్డే ప్రపంచకప్ సమరం ముగిసింది. ఇప్పుడు అందరి దృష్టి టీ20 ప్రపంచకప్ 2024 పై పడింది. వచ్చే ఏడాది జూన్‌లో ఈ మెగా టోర్నీ జరగనుంది. యూఎస్, వెస్టిండీస్ జట్లు టీ20 ప్రపంచకప్‌కు సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఇప్పటికే ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆయా దేశాలు మొదలెట్టాయి. 2022 టీ20 ప్రపంచకప్‌లో మొత్తం 16 జట్లు పోటీ పడగా ఈ సారి మాత్రం 20 జట్లు తలపడనున్నాయి. తాజాగా అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ఈ మెగా టోర్నీలో పాల్గొనే 20 జట్ల వివరాలను వెల్లడించింది.

ఏ ప్రతిపాదిన జట్ల ఎంపిక జరిగిందంటే..?

ఐసీసీ 12 జట్లకు నేరుగా అర్హత కల్పించింది. అది ఎలాగంటే.. గత టీ20 ప్రపంచకప్‌లో టాప్-8లో నిలిచిన ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, భారత్, పాకిస్తాన్, న్యూజిలాండ్, శ్రీలంక, దక్షిణాఫ్రికా, నెదర్లాండ్స్ జట్లలతో పాటు అతిథ్య హోదాలో యూఎస్, వెస్టిండీస్ లతో కలిపి మొత్తం 10 జట్లు నేరుగా అర్హత పొందాయి. అంతేకాకుండా టీ20 ర్యాంకింగ్స్‌లో తొమ్మిది, పది స్థానాల్లో నిలిచిన అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్‌లు కూడా డైరెక్టుగా అర్హత సాధించాయి. మిగిలిన 8 స్థానాల కోసం రీజియన్ల వారీగా క్వాలిఫయింగ్ పోటీలను నిర్వహించారు. అమెరియన్ క్వాలిఫయర్ విన్నర్‌గా నిలిచిన కెనడా, ఏసియా క్వాలిఫయర్ ఫైనల్‌కు చేరుకున్న నేపాల్, ఒమన్, ఈస్ట్ ఆసియా-పసిఫిక్ క్వాలిఫయర్ విజేత పపువా న్యూ గినియా, యూరోపియన్ క్వాలిఫయర్ ఫైనల్‌కు చేరుకున్న ఐర్లాండ్, స్కాంట్లాండ్, ఆఫ్రికా క్వాలిఫయర్ ఫైనల్‌కు చేరుకున్న ఉగాండ, నబీబియాలు టీ20 ప్రపంచకప్‌కు అర్హత సాధించాయి,.

టీ20 ప్రపంచకప్‌లో పాల్గొనే జట్లు ఇవే..

ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, భారత్, పాకిస్తాన్, న్యూజిలాండ్, శ్రీలంక, దక్షిణాఫ్రికా, నెదర్లాండ్స్, యూఎస్, వెస్టిండీస్, అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్, కెనడా, నేపాల్, ఒమన్, పపువా న్యూ గినియా, ఐర్లాండ్, స్కాంట్లాండ్, ఉగాండ, నబీబియా

20 జట్లతో టోర్నీ ఎలా జరగనుందంటే..?

మొత్తం 20 జట్లను నాలుగు గ్రూపులుగా విభజించనున్నారు. ఒక్కో గ్రూపులో 5 జట్లు ఉంటాయి. ప్రతీ గ్రూపులో టాప్-2లో నిలిచిన జట్లు సూపర్-8లోకి ప్రవేశిస్తాయి. అక్కడ 8 జట్లను రెండు గ్రూపులుగా విభజిస్తారు. ప్రతీ గ్రూపులో టాప్-2లో నిలిచిన జట్లు సెమీ ఫైనల్‌కు చేరుకుంటాయి. సెమీ ఫైనల్‌లో విజేతలుగా నిలిచిన జట్లు ఫైనల్ మ్యాచ్‌లో కప్పు కోసం అమీతుమీ తేల్చుకోనున్నాయి.









# ఎగ్జిట్ పోల్స్ అంచనాలపై..
# నేడు బీజేపీ కీలక భేటీ..!

ఐదు రాష్ట్రాల్లో హోరాహోరీగా జరిగిన శాసనసభ ఎన్నికలకు సంబంధించి ఎగ్జిట్ పోల్స్ వెలువడ్డాయి. ఇందులో రెండు రాష్ట్రాలు బీజేపీకు, రెండు రాష్ట్రాలు కాంగ్రెస్‌కు చేజిక్కే అవకాశముందని ముందస్తు అంచనాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఎగ్జిట్ పోల్స్ అంచనాలపై చర్చించేందుకు బీజేపీ నేడు కీలక సమావేశం నిర్వహించనుంది. శుక్రవారం సాయంత్రం ఢిల్లీలోని భాజపా ప్రధాన కార్యాలయంలో పార్టీ జనరల్ సెక్రటరీలతో అధిష్ఠానం కీలక సమావేశం నిర్వహించనుంది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలతో పాటు ఆదివారం (డిసెంబరు 3) ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల వెలువడిన తర్వాత అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ భేటీలో చర్చించనున్నారు. ఎగ్జిట్‌పోల్స్ ప్రకారం తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ పార్టీకి మొగ్గు ఉంటుందని అంచనాలు వెలువడగా.. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో కమలం వికసించే అవకాశాలున్నట్లు కన్పిస్తున్నాయి. మిజోరంలో 'జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్' (జడ్‌పీఎం), 'మిజో నేషనల్ ఫ్రంట్' (ఎంఎన్‌ఎఫ్) మధ్య గట్టి పోటీ ఉండనున్నట్లు ముందస్తు అంచనాలు వెలువడ్డాయి. అయితే, ఈ అంచనాలపై కొందరు రాజకీయ నేతలు అవిశ్వాసం వ్యక్తం చేయగా.. మరికొందరు మాత్రం విజయంపై ధీమాగా ఉన్నారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు డిసెంబరు 3న వెలువడనున్నాయి. ప్రస్తుతం తెలంగాణలో బీఆర్ఎస్, మధ్యప్రదేశ్‌లో బీజేపీ, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నాయి. మరి ఎగ్జిట్ పోల్స్ అంచనాలు నిజమవుతాయా? ఈ రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మారుతాయా? లేదా అన్నది తెలియాలంటే ఆదివారం వరకు వేచి చూడాల్సిందే..!

# లాభాల్లో స్టాక్ మార్కెట్



అంతర్జాతీయ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాల మధ్య దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం లాభాలతో ప్రారంభమయ్యాయి. ఉదయం 9:30 గంటల సమయంలో సెన్సెక్స్ 306 పాయింట్ల లాభంతో 67,295 సమీపంలో ట్రేడవుతోంది. నిఫ్టీ 95 పాయింట్లు పెరిగి 20,228 దగ్గర సరికొత్త గరిష్ఠాన్ని నమోదు చేసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 83.28 వద్ద ప్రారంభమైంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎల్అండ్‌టీ, ఎన్‌టీపీసీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, ఐటీసీ, పవర్‌గ్రిడ్, సన్‌ఫార్మా, ఎస్‌బీఐ, బజాజ్ ఫైనాన్స్, రిలయన్స్, మారుతీ, అల్ట్రాటెక్ సిమెంట్స్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. విప్రో, టైటన్, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టాటా మోటార్స్, నెస్లే ఇండియా షేర్లు మాత్రమే నష్టాల్లో కొనసాగుతున్నాయి. అమెరికా మార్కెట్ సూచీలు గురువారం భారీ లాభాల్లో ముగిశాయి. ద్రవ్యోల్బణం దిగొచ్చిందనే సంకేతాలు అక్కడి మదుపర్లను ఉత్సాహపర్చాయి.

# నాగ చైతన్య దూత రివ్యూ

అక్కినేని యువ నటుడు నాగచైతన్య తొలిసారిగా నటించిన వెబ్ సిరీస్ దూత. మొత్తంగా 8 ఎపిసోడ్స్ కలిగిన ఈ సస్పెన్స్ థ్రిల్లింగ్ యాక్షన్ వెబ్ సిరీస్ ని శరత్ మరార్ నిర్మించగా విక్రమ్ కె కుమార్ తెరకెక్కించారు. మరి ఈ వెబ్ సిరీస్ ఎలా ఉంది అనేది పూర్తి సమీక్ష లో చూద్దాం.

కథ: సాగర్ (నాగ చైతన్య) మొదట జర్నలిస్ట్ గా తన ప్రస్థానాన్ని ప్రారంభించి అనంతరం సమాచార్ పత్రికకు చీఫ్ ఎడిటర్ గా పైస్థాయికి ఎదుగుతాడు. దీంతో సాగర్ చాలా ఉప్పొంగిపోతాడు, అయితే తన జీవితంలో వరుస విషాదాలు చోటుచేసుకోవడంతో అతని ఆనందం ఎక్కువ కాలం నిలవదు. అయితే ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, కొన్ని వార్తాపత్రికలు క్లిప్పింగ్‌లుగా ఈ విషాదాలను ముందుగానే అంచనా వేస్తాయి. మరి అది ఎలా సాధ్యం, సాగర్‌కి తన ప్రొఫెషన్ లో శత్రువులు ఎవరైనా ఉన్నారా, మరి చివరిగా ఆ వార్తాపత్రికల క్లిప్పింగ్‌ల వెనుక రహస్యాన్ని సాగర్ ఛేదించగలిగాడా లేదా అనేది మొత్తం దూత సిరీస్ లో చూడాల్సిందే.




ప్లస్ పాయింట్స్: ముందుగా దేనికైనా కథ ప్రధానం, అనంతరం దానిని దర్శకడు ఎలా ఆడియన్స్ కి కనెక్ట్ చేసాడు అనేది మరింత ముఖ్యం. నిజానికి దూత లో ప్రధాన పాయింట్ పాతదే అలానే గతంలో విక్రమ్ కుమార్ తెరకెక్కించిన సినిమాల్లో వచ్చిందే. అయితే దూత కథనాన్ని మాత్రం విక్రమ్ కుమార్ అద్భుతంగా ముందుకు నడిపారు అని చెప్పాలి. నిజానికి ఇటువంటి పాత కథని తీసుకుని ఇంట్రెస్టింగ్ గా ఇప్పటి ఆడియన్స్ కి కనెక్ట్ చేయడం మాములు విషయం కాదు. ఫస్ట్ ఎపిసోడ్ నుండి దాదాపుగా ప్రతి ఎపిసోడ్ లో కూడా మనల్ని ఆకట్టుకుంటుంది దర్శకుడి టేకింగ్. ముఖ్యంగా సస్పెన్స్ ని బాగా హ్యాండిల్ చేయడంతో పాటు విజువల్స్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్, సీన్స్ మనల్ని ఎంతో అలరిస్తాయి. మధ్యలో వచ్చే కొందరి క్రైమ్ తో పాటు డెత్ సన్నివేశాలు మనకు ఏమి జరుగుతోంది అనేటువంటి ఇంట్రెస్ట్ ని మరింత పెంచుతాయి. దీని ద్వారా సొసైటీ కి దర్శకుడు విక్రమ్ కె కుమార్ మంచి మెసేజ్ ని అందించారు. అలానే ఇదేమి మనపై ఫోర్స్ ఫుల్ గా కూడా ఉండదు. ప్రతి క్యారెక్టర్ లో ఎంతో డెప్త్ ఉండడంతో పాటు చివరి వరకు ప్రతి క్యారెక్టర్ కథనాన్ని ఇంట్రెస్టింగ్ గా ముందుకి తీసుకుకెళుతుంది. ముఖ్యంగా నాగ చైతన్య తన తొలి వెబ్ సిరీస్ లో అద్భుతంగా నటించారు. తన క్యారెక్టర్ లో రెండు షేడ్స్ ఉన్నా, వాటిని బాగా పెర్ఫార్మ్ చేసారు. తన ఫ్యామిలీ యొక్క సేఫ్టీ ని ఎంతో జాగ్రత్తగా చూసుకునే వ్యక్తిగా ఆయన తన క్యారెక్టర్ లో ఒదిగిపోయారు. ఎమోషనల్ సీన్స్ లో కూడా బాగా యాక్ట్ చేశారు. ఇక పార్వతి తిరువోతు కూడా తన పాత్ర యొక్క పరిధి మేరకు ఎంతో బాగా నటించారు. ప్రియా భవానీ శంకర్, ప్రాచీ దేశాయ్, పశుపతి, రవీంద్ర విజయ్, తరుణ్ భాస్కర్ తదితరులు తమ తమ పాత్రల్లో అద్భుతంగా నటించారు. ట్విస్ట్‌లు ఒక్కొక్కటిగా రివీల్ అవుతూ సాగె క్లైమాక్స్ ఎపిసోడ్ చాలా బాగుంది. సిరీస్ అంతటా వర్షపు నేపథ్యం ఆడియన్స్ కి కొత్త అనుభవాన్ని అందిస్తుంది.

మైనస్ పాయింట్స్: అయితే ఈ సిరీస్ లో వచ్చే ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్స్ మాత్రం ఇంట్రెస్టింగ్ గా లేవు. వాటిని మరింత బాగా దర్శకుడు విక్రమ్ కె కుమార్ రాసుకుని ఉంటే బాగుండేదని పిస్తుంది. అలానే రన్ టైం పరంగా కూడా కొంత లెంగ్త్ తగ్గిస్తే బాగుండేది. మధ్యలో అక్కడక్కడా కొన్ని ఎపిసోడ్స్ లో సిరీస్ వేగం తగ్గుతుంది. సిరీస్ లోని కొన్ని డైలాగులు అక్కడక్కడ కొందరు ఆడియన్స్ కి ఇబ్బందిగా ఉంటాయి.

సాంకేతిక వర్గం: ఇషాన్ చాబ్రా అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అయితే ఎంతో బాగుంది. మికోలాజ్ సైగులా యొక్క సినిమాటోగ్రఫీ కూడా సూపర్ అనే చెప్పాలి. విజువల్స్ తో పాటు సిరీస్ మొత్తం కూడ ఎంతో గ్రాండ్ గా ఉంది. అయితే ఎడిటింగ్ విభాగం మరింతగా వర్క్ చేసి కొన్ని సీన్స్ అక్కడక్కడా ట్రిమ్ చేయాల్సింది. గతంలో డిజప్పాయింట్ చేసిన విక్రమ్ కుమార్, ప్రస్తుతం దూత సిరీస్ తో సింపుల్ పాయింట్ తీసుకుని దానిని ఆడియన్స్ కి కనెక్ట్ చేసే విధంగా ఎడ్జ్ థ్రిల్లర్ గా బాగా తెరకెక్కించారు. అలానే ఇందులో సొసైటీ కి ఇచ్చిన మెసేజ్ కూడా ఎంతో బాగుంది.

తీర్పు: మొత్తంగా నాగ చైతన్య, విక్రమ్ కుమార్ ల క్రేజీ కాంబినేషన్ లో వచ్చిన ఈ దూత వెబ్ సిరీస్ మిస్టరీ థ్రిల్లింగ్ కాన్సెప్ట్ తో ఆడియన్స్ ని ఆకట్టుకుంటుంది అని చెప్పాలి. కథ పాతదే అయినప్పటికీ కూడా కథనాన్ని దర్శకుడు ఇంట్రెస్టింగ్ గా నడిపిన తీరు బాగుంది. నటీనటుల పెర్ఫార్మన్స్, హై టెక్నీకల్ వాల్యూస్, ఆకట్టుకునే బ్యాక్ గ్రౌండ్ స్కోర్, ఫోటోగ్రఫీ వంటివి దీని ప్రధాన బలాలు. అయితే రన్ టైం పరంగా మాత్రం కొంత ఎక్కువనే అనిపిస్తుంది. ఇక ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్స్ కూడా మరింత ఇంట్రెస్టింగ్ గా రాసుకోవాల్సింది. మొత్తంగా ఈ సిరీస్ ద్వారా నాగ చైతన్య ఓటిటి ఆడియన్స్ ని ఎంతో ఆకట్టుకుంటారని చెప్పవచ్చు.



## కాకినాడ జిలాల్లో బోటులో అగ్నిప్రమాదం

కాకినాడ సముద్ర జలాల్లో బోటులో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఇంజిన్‌లో మంటలు భారీగా చెలరేగాయి. అందులో వంటకు వాడే గ్యాస్ సిలిండర్లు సైతం పేలాయి. రూ.80 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగింది. బోటు పూర్తిగా దగ్ధమైంది. వారం కిందట సముద్రంలో బోటు వేటకు వెళ్లింది. తుపాను కారణంగా మచిలీపట్నం నుంచి తిరుగు ప్రయాణమైంది. కాకినాడ చేరేందుకు ఇంకా నాలుగు గంటల సమయం ఉండగానే తెల్లవారు జామున ప్రమాదం జరిగింది. సమాచారం అందుకుని కోస్ట్ గార్డ్ రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. 12 మంది మత్స్యకారులను కోస్ట్ గార్డ్ సిబ్బంది ప్రాణాలతో కాపాడారు. కోస్ట్ గార్డ్ ఆపరేషన్‌తో 12 మంది మత్స్యకారులు సురక్షితంగా ఉన్నట్టు తెలుస్తోంది.



## బెంగళూరులో 15 స్కూళ్లకు బాంబు బెదిరింపులు

కర్ణాటక రాజధాని బెంగళూరులోని పలు పాఠశాలలకు శుక్రవారం ఉదయం బాంబు బెదిరింపులు రావడం తీవ్ర కలకలం రేపుతోంది. గుర్తుతెలియని ఒక ఈ మెయిల్ నుంచి ఈ బెదిరింపులు వచ్చాయి. దాంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వణికిపోయారు. మీడియా కథనాల ప్రకారం.. ఈ రోజు ఉదయం సుమారు 15 పాఠశాలలకు బాంబు బెదిరింపు వచ్చింది. తొలుత ఏడు స్కూళ్లకు ఈ బెదిరింపు మెయిల్లు రాగా.. ఆ తర్వాత కొద్దిసేపటికే మరికొన్ని విద్యాసంస్థలకు అదే తరహా ఈ మెయిల్లు వచ్చాయి. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు.. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులను పాఠశాలలను నుంచి బయటకు పంపించారు.



## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న చంద్రబాబు

తెదేపా అధినేత చంద్రబాబు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సతీమణి భువనేశ్వరితో కలిసి దర్శనం చేసుకున్నారు. అంతకుముందు వైకుంఠం కాంప్లెక్స్ వద్ద వారికి తితిదే అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాటు చేశారు. శ్రీవారి దర్శనం అనతరం రంగనాయకుల మండపంలో చంద్రబాబు దంపతులకు అర్చకులు వేదాశీర్వచనం పలికారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను వారికి అందజేశారు. చంద్రబాబు వెంట మాజీ మంత్రి అమర్నాథరెడ్డితో పాటు పలువురు నేతలు ఉన్నారు. అలిపిరి వద్ద దాడి జరిగినప్పుడు శ్రీవారే కాపాడారని తెదేపా అధినేత చంద్రబాబు అన్నారు. తిరుమల శ్రీవారి దర్శనానంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "త్వరలోనే నా కార్యాచరణ ప్రకటిస్తాను. ప్రజలకు సేవ చేసే శక్తి, సామర్థ్యాలు ఇవ్వాలని శ్రీవారిని వేడుకున్నాను. కష్టం వచ్చినప్పుడు స్వామివారిని మొక్కుకున్నాను. ధర్మాన్ని కాపాడాలని ప్రార్థించాను. ప్రపంచంలోనే భారతదేశం అగ్రస్థానంలో ఉండాలి. తెలుగుజాతి ప్రపంచంలోనే నంబర్ వన్‌గా ఉండాలి" అని కోరుకున్నట్లు చంద్రబాబు వెల్లడించారు.

## గతంలో ఎగ్జిట్ పోల్స్ తారుమారు: బండి సంజయ్



రాష్ట్రంలో గతంలో వివిధ ఎన్నికల సందర్భంగా వెల్లడైన ఎగ్జిట్ పోల్స్ తారుమారయ్యాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఆ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ అభ్యర్థి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. తెలంగాణలో మెజార్టీ స్థానాలు గెలవబోతున్నామని, కరీంనగర్ అసెంబ్లీలోనూ బీజేపీ జెండా ఎగురబోతోందని ధీమా వ్యక్తం చేశారు. గురువారం కరీంనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీఆర్ఎస్ లోని తెలంగాణ పేరును తీసేసి తన పార్టీ పేరును బీఆర్ఎస్ గా మార్చుకున్న కేసీఆర్ తెలంగాణ సెంటిమెంట్ అనడం ఏంటని ప్రశ్నించారు. నాగార్జునసాగర్ సమస్య ఇప్పుడే తెరమీదకు రావడంలో ఆంతర్యం ఏంటని అన్న ఆయన.. కేసీఆర్ తప్పుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

# ఆస్ట్రేలియా VS ఇండియా నాలుగో టీ20..



ఆస్ట్రేలియాతో షార్ట్ ఫార్మాట్‌లో సిరీస్‌లో మరో రసవత్తర పోరుకు టీమిండియా రెడీ అయ్యింది. శుక్రవారం జరిగే నాలుగో టీ20 మ్యాచ్‌లో ఇరుజట్లు గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నాయి. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ప్రస్తుతం ఇండియా 2-1 లీడ్‌లో ఉంది. అయితే బౌలింగ్ ఫెయిల్యూర్స్‌తో మూడో టీ20లో ఓడిన ఇండియా.. ఈ మ్యాచ్ గెలిచి సిరీస్‌ను పట్టేయాలని టార్గెట్‌గా పెట్టుకుంటే.. లెక్క సరి చేయాలని కంగారూలు ప్లాన్స్ వేస్తున్నారు. ఈ నేపథ్యంలో టీమిండియా బౌలర్లకు మరోసారి కఠిన పరీక్ష ఎదురుకానుంది. డెత్ ఓవర్స్ బౌలింగ్ పర్ఫెక్షన్ కోసం ఇండియా ఈ మ్యాచ్‌లో బౌలర్లను మార్చే చాన్స్ ఉంది. గత మ్యాచ్‌లో 4 ఓవర్లలో 68 రన్స్ ఇచ్చిన ప్రసిధ్‌పై వేటు వేయనున్నారు. కొత్తగా టీమ్‌లోకి వచ్చిన దీపక్ చహర్‌కు ఈ మ్యాచ్‌లో అవకాశం ఇస్తారో లేదో చూడాలి. గత మ్యాచ్‌కు దూరమైన ముకేశ్ కుమార్ రాకతో బౌలింగ్ బలం పెరిగింది. అవేశ్ ఖాన్‌ను కంటిన్యూ చేస్తే, అర్ష్‌దీప్, చహర్‌లో ఒకరికే చాన్స్ ఉంటుంది. స్పిన్ ఆల్‌రౌండర్‌గా అక్షర్ పటేల్‌తో పాటు స్పిన్నర్ రవి బిష్ణోయ్ ఈ మ్యాచ్‌లో కీలకం కానున్నారు. బ్యాటింగ్‌లో భారీ మార్పులు కనిపించడం లేదు. స్టార్ ప్లేయర్ శ్రేయస్ అయ్యర్ వస్తే తెలుగు బ్యాటర్ తిలక్ వర్మకు చాన్స్ దక్కకపోవచ్చు. మిగతా లైనప్‌లో యశస్వి, రుతురాజ్ ఓపెనింగ్ చేయనున్నారు. ఇషాన్, సూర్య కుమార్ మెరిస్తే మరోసారి భారీ స్కోరు ఖాయం. ఫినిషర్‌గా రింకూ సింగ్‌పైనే ఎక్కువగా ఆశలు పెట్టుకున్నారు. ఓవరాల్‌గా బ్యాటింగ్‌లో ఇబ్బందుల్లేకపోయినా ఈ మ్యాచ్‌లో నెగ్గాలంటే బౌలర్లు శక్తికి మించి శ్రమించాలి.

**గ్రీన్‌కు చాన్స్..**

వర్క్‌లోడ్‌లో భాగంగా మ్యాక్స్‌వెల్, స్టొయినిస్, ఆడమ్ జంపా, స్మిత్, ఇంగ్లిస్‌ను తప్పించిన ఆస్ట్రేలియా యంగ్‌స్టర్స్‌కు అవకాశం ఇవ్వనుంది. ఇందులో భాగంగా ఆఫ్ స్పిన్నర్ క్రిస్ గ్రీన్‌కు తొలి మ్యాచ్ ఆడే చాన్స్ దక్కొచ్చు. జోస్ ఫిలిప్, బెన్ మెక్‌డెర్మాట్, బెన్ డ్వారిషస్‌లను కూడా తుది జట్టులోకి తీసుకొచ్చే అవకాశం ఉంది. ఓపెనింగ్‌లో ఆరోన్ హ్యార్డీ, హెడ్ శుభారంభం ఇస్తే ఆసీస్‌కు తిరుగుండదు. అయితే సీనియర్లు లేకపోవడంతో మిడిలార్డర్ బాధ్యతలు మొత్తం షార్ట్, టిమ్ డేవిడ్, వేడ్‌పైనే ఉన్నాయి. చివర్లో మెక్‌డెర్మాట్ బ్యాట్ ఝుళిపించాల్సిన అవసరం ఉంది. బౌలింగ్‌లో నేథన్, బెరెన్‌డార్ఫ్‌తో పాటు స్పిన్నర్‌గా సంగా కీలకం కానున్నాడు. ఓవరాల్‌గా ఈ మ్యాచ్ గెలిచి సిరీస్‌ను ఐదో టీ20 వరకు తీసుకెళ్లాలని కంగారూలు పక్కా ప్లాన్‌తో ఉన్నారు.

జట్లు (అంచనా):

ఇండియా: సూర్య కుమార్ (కెప్టెన్), యశస్వి, రుతురాజ్, ఇషాన్, తిలక్ వర్మ, రింకూ సింగ్, అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ సింగ్/ దీపక్ చహర్, ప్రసిధ్ కృష్ణ/ అవేశ్ ఖాన్, ముకేశ్ కుమార్.

ఆస్ట్రేలియా: మాథ్యూ వేడ్ (కెప్టెన్), ఆరోన్ హ్యార్డీ, ట్రావిస్ హెడ్, మాథ్యూ షార్ట్, బెన్ మెక్‌డెర్మాట్, టిమ్ డేవిడ్, క్రిస్ గ్రీన్, బెన్ డ్వారిషస్, నేథన్ ఎలిస్, బెరెన్‌డార్ఫ్, తన్వీర్ సంగా.



## ఏడాదిగా తల్లి మృతదేహంతో ఇంట్లోనే అక్కాచెల్లెళ్లు..

ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసిలో ఇద్దరు అక్కాచెల్లెళ్లు ఏడాది క్రితం చనిపోయిన తల్లి మృతదేహాన్ని ఇంట్లోనే పెట్టుకొని జీవిస్తున్న వ్యవహారం తాజాగా వెలుగులోకి వచ్చింది. నగరంలోని మదర్వా ప్రాంతానికి చెందిన ఉషా త్రిపాఠి తన ఇద్దరు కూతుళ్లు పల్లవి (27), వైశ్విక్ (17)లతో కలిసి ఓ ఇంట్లో జీవించేవారు. పల్లవి పీజీ పూర్తిచేయగా, వైశ్విక్ పదో తరగతి చదువుతోంది. రెండేళ్ల క్రితమే ఉషా భర్త ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆమె చిన్న దుకాణం నడుపుతూ జీవనం సాగించేది. గతేడాది డిసెంబరు 8న ఉషా అనారోగ్యంతో మృతిచెందింది. ఈ విషయాన్ని అక్కాచెల్లెలిద్దరూ ఎవరికీ చెప్పలేదు. మృతదేహాన్ని ఇంట్లోనే పెట్టుకొని.. కావలసిన వస్తువుల కోసం అప్పుడప్పుడు బయటకు వెళ్లి వచ్చేవారు. మీర్జాపుర్‌లో ఉంటున్న ధర్మేంద్రకుమార్ బుధవారం తన చెల్లి ఉషా త్రిపాఠిని చూసేందుకు వచ్చాడు. ఎంతసేపటికీ తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చిన ధర్మేంద్ర పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు తలుపులు పగలగొట్టి చూస్తే.. ఓ గదిలో మహిళ అస్థిపంజరం, మరో గదిలో అక్కాచెల్లెళ్లు ఉన్నారు. ఆ ఇద్దరి మానసిక పరిస్థితి సరిగా లేదని దర్యాప్తులో తేలింది. అయితే, తల్లి చనిపోయిన తేదీని గుర్తుంచుకోవడం కాస్త అనుమానంగా ఉందని పోలీసులు తెలిపారు. పల్లవి, వైశ్విక్‌లను వైద్యపరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

## ఓట్ల కోసమే 'నాగార్జునసాగర్' వివాదం: పురందేశ్వరి



ఎన్నికలు జరుగుతున్న సమయంలో తెలుగు రాష్ట్రాల సరిహద్దులోని నాగార్జునసాగర్ వద్ద నీటి విడుదల అంశాన్ని వివాదాస్పదం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు భాజపా రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు పురందేశ్వరి పేర్కొన్నారు. ఇన్నాళ్లూ నీటి విడుదల విషయం ప్రభుత్వానికి ఎందుకు గుర్తుకురాలేదని ప్రశ్నించారు. కేవలం ఓట్ల కోసం వివాదం చేసినట్లుగా కనిపిస్తోందన్నారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' రథం ప్రారంభ సందర్భంగా పురందేశ్వరి విలేకర్లతో మాట్లాడారు. 'రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించనందువల్లే... ప్రైవేటు ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ కింద చికిత్సలను అందించలేకపోతున్నాయి. రాష్ట్రంలో 400 మండలాల్లో కరవు తాండవం చేస్తోంది. అయినా 100 మండలాలనే కరవు ప్రాంతాలుగా ప్రకటించారు. కరవుపై అధికారులు ముందస్తు సమాచారమిచ్చినా.. తగిన చర్యలు తీసుకోకపోవడం రైతులను వంచించడమే. మంత్రివర్గ సమావేశంలో ఇంతవరకూ కరవుపై చర్చ జరగలేదు. బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాల్లో కేంద్ర పథకాలకు రాష్ట్ర ప్రభుత్వాలు స్టిక్కర్లు అంటిస్తున్నాయి. దీన్ని అడ్డుకునేందుకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ద్వారా ప్రజలకు కేంద్ర పథకాలపై అవగాహన కల్పిస్తాం' అని పేర్కొన్నారు. సీఎం జగన్ స్క్రిప్ట్ మేరకు తెలంగాణలో పోలింగ్ సందర్భంగా ఆ రాష్ట్ర సీఎం కేసీఆర్ ఓటర్లను రెచ్చగొట్టి లబ్ధి పొందేందుకు నాగార్జునసాగర్ వద్ద డ్రామాకు తెరలేపారని బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి లంకా దినకర్ ఓ ప్రకటనలో ఆరోపించారు.



## ఇరాక్‌లో బాంబు దాడి.. 10 మంది మృతి

ఇరాక్‌లోని దియాలా ప్రావిన్స్‌లో స్థానిక ఎంపీ బంధువులపై బాంబు దాడి జరిగింది. ఈ ఘటనలో పది మంది మృతి చెందగా.. మరో 14 మందికి తీవ్ర గాయాలయ్యాయి. గురువారం రాత్రి వారు ప్రయాణిస్తున్న వాహనం అమ్రానియా ప్రాంతానికి చేరుకోగానే కొందరు దుండగులు నాటుబాంబులతో వాహనంపై దాడిచేశారు. అనంతరం తుపాకులతో కాల్పులకు తెగబడ్డారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఘటన జరిగిన ప్రాంతంలో కర్ఫ్యూ విధించి దుండగుల కోసం గాలిస్తున్నారు.

## నెలలో 101 సార్లు ఫోన్.. వాహన షోరూంపై బాధితుడు ఫిర్యాదు

క్రెడిట్ కార్డులు, సర్వీసింగ్, రీఛార్జి పేరిట తరచూ ఫోన్‌కాల్స్ వస్తుంటాయి.. ఆ నెంబర్లను బ్లాక్ చేసినా మార్చి చేస్తుంటారు.. దీంతో వినియోగదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇలా ఓ వ్యక్తికి ఒకటి కాదు.. రెండు కాదు.. నెలలో 101 సార్లు ఫోన్ చేసి తీవ్ర ఇబ్బందులకు గురిచేయడంతో ఒకటో పట్టణ ఠాణాకు వచ్చి ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి... నవంబరులో ఏకంగా 101 సార్లు ఫోన్లు చేశారు. అప్పటికీ ఆ నంబర్లను బ్లాక్‌లో పెట్టినా, 39 వేర్వేరు నంబర్ల నుంచి చేశారు. ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యుల చరవాణికి కాల్స్ వచ్చాయి. పలుమార్లు హెచ్చరించినప్పటికీ వారిలో మార్పు రాలేదు. పైగా బాధితులనే బెదిరించారు. దీంతో దిలీప్ పోలీసులను ఆశ్రయించారు. వారు కంపెనీ సిబ్బందిని పిలిపించి మందలించారు. మరోసారి ఫోన్ వస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించి పంపారు.



# ఆ క్షణాల కోసం ఎదురుచూస్తున్నా..

ఉత్తమనటి కృతి సనన్. జాతీయ వార్డుల వేడుకలో తనకు బన్నీతో కలిసి నటించాలని ఉందని చెప్పింది. జాతీయ ఉత్తమనటుడిగా అవార్డును అందుకోవడానికి బన్నీ ఆ కార్యక్రమానికి రావడం, బన్నీతో కలిసి ఫొటోలకు పోజులివ్వడం.. ఆ సందర్భంలో మీడియా ముందు తన కోరికను తెలియజేయడం జరిగింది. సందర్భం డిమాండ్‌ని బట్టి తను అలా మాట్లాడిందని చాలామంది అప్పట్లో అనుకున్నారు. కానీ

... చేసింది కృతి. 'అల్లు అర్జున్‌ను తొలిసారి నేషనల్ అవార్డుల ఫంక్షన్‌లో చూశాను. కాసేపు మాట్లాడినా చాలు.. ఎవరైనా అతని అభిమానులు అయిపోతారు. తను అద్భుతమైన నటుడేకాదు, అద్భుతమైన వ్యక్తి కూడా. బన్నీతో కలిసి పనిచేసే క్షణాలకోసం ఎదురు చూస్తున్నాను. మా ఇద్దరికీ తగ్గ కథను ఎవరైనా దర్శకుడు తయారు చేయాలని, అది తర్వగా జరగాలని కోరుకుంటున్నా' అని అశాభావం వ్యక్తం చేసింది కృతి సనన్.